సాక్షి
గుంటూరు
బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



ఈవీఎం గోదాములో తనిఖీ

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డు లోని ఈవీఎంలు భద్రపర్చిన గోదామును పార్టీల ప్రతినిధులతో కలసి కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం తనిఖీ చేశారు.



బీ ఫార్మసీ పరీక్ష కేంద్రాల్లో తనిఖీ

పెదకాకాని(ఏఎన్‌యూ): ఏఎన్‌యూ పరిధిలో బీ ఫార్మసీ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్ష కేంద్రాలను మంగళవారం పీజీ, వృత్తివిద్య కోర్సు పరీక్షల సమన్వయకర ఎం.సుబ్బారావు తనిఖీ చేశారు.



కోటి లింగాల క్షేత్రంలో చండీహోమం

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని కోటి లింగాల క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం మహా కాళీ మాతకు చండీహోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

బాలాత్రిపుర సుందరీదేవిగా బాల చాముండేశ్వరి దేవి దర్శనం



అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీబాల చాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో బాల చాముండేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలలో భాగంగా చండీ, రుద్రహోమాలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖర శర్మ బాల త్రిపురసుందరి దేవి అలంకార విశిష్టతను వివరించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసుర మర్ధని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో రెండో రోజు అమ్మవారికి వారాహిదేవి అలంకారం చేసి, ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలలో పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్ 2025ను మంగళవారం నిర్వహించారు. యువత తమలోని ప్రతిభ, పారిశ్రామిక ఆలోచనలను ప్రదర్శించేందుకు ఉత్సాహపూరితమైన వేదికను ఈ హ్యాకథాన్ అందించింది. సృజనాత్మక ఆలోచనలు పెంచేలా కార్యక్రమం నిలిచింది. విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా స్వాగత హోర్డింగులు



తాడేపల్లి రూరల్: విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో జరిగే దేవి నవరాత్రుల కోసం వచ్చే భక్తులకు స్వాగతం పలుకుతూ ప్రతి సంవత్సరం పలుచోట్ల దేవదాయ శాఖ అధికారులు హోర్డింగులు ఏర్పాటు చేస్తారు. ఇలా తయారు చేయించిన హోర్డింగులు మంగళవారం కూడా సీతానగరం సీతా భవనంలోనే గోడలకు ఆనించి దర్శనమిచ్చాయి. ఏటా వేడుకలకు ముందుగానే వీటిని ప్రకాశం బ్యారేజ్ వద్ద ఏర్పాటు చేసేవారు. ఈ సారి మాత్రం నవరాత్రులు ప్రారంభమై రెండు రోజులు అవుతున్నా ఇక్కడే ఉండడంతో ఆ శాఖ నిర్లక్ష్యంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



తాడికొండ: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 25వ తేదీన వెలగపూడిలో రాష్ట్ర సచివాలయం సమీపంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను మంగళవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ , విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు, జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌లు పరిశీలించారు. ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవలు వారి వెంట ఉన్నారు. జిల్లాల నుంచి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతుల కల్పనకు సంబంధించి అధికారులకు సూచనలు ఇచ్చారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



పెదకాకానిలో గాయత్రీదేవిగా కొలువుదీరిన భ్రమరాంబ



విశేష అలంకరణలో పూజలు అందుకున్న ఉత్సవమూర్తులు

పెదకాకాని / మంగళగిరి: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో గాయత్రీదేవిగా భ్రమరాంబ భక్తులను అనుగ్రహించారు. శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం అన్నపూర్ణదేవిగా భ్రమరాంబ అనుగ్రహిస్తారని ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. మంగళాద్రిలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారు మంగళవారం శ్రీ గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉత్సవ ఏర్పాట్లను ఈవో సునీల్‌కుమార్ పర్యవేక్షించారు.



మంగళగిరిలో గజలక్ష్మి అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు

పచ్చగా పదవుల పందేరం!

- నగానికిపైగా కీలక పదవుల్లో ఒక సామాజిక వర్గం వారే
- చినబాబు ఇలాకాలో ఇతర వర్గాలకు మొండిచేయి
- కాపులు, ఎస్సీల్లోని ఓ వర్గం, బీసీల్లోని కీలక వర్గాలకు దక్కని ప్రాతినిధ్యం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట
- ఎన్ని విమర్శలు వచ్చినా తీరు మారని చంద్రబాబు సర్కారు
- తాజాగా రెక్టార్ నియామకంలోనూ అదే పక్షపాతం

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పదవులు, పెత్తనం అన్నింటిలో ఒకే సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తున్నారు. సీఎం చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారు వర్సిటీలోని పాలన, కార్యనిర్వహణ పదవుల్లో కీలమైన వాటిని ఎక్కువగా తమ వర్గానికే యథేచ్ఛగా కట్టబెడుతుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అయినప్పటికీ వారి ప్రయోజనాలే ముఖ్యమన్నట్లుగా కూటమి పాలకులు వ్యవహరిస్తున్నారు.

ఏఎన్‌యూలో ఒకే సామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యం



ఏఎన్‌యూ ప్రధాన ద్వారం

పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుంచి పాలన, కార్యనిర్వహణ పదవుల్లో అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేవారు. జనాభా ప్రాతిపదికన ఆయా వర్గాలకు పెద్దపీట వేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమ సామాజిక వర్గానికే అన్ని పదవులు కట్టబెడుతున్నారు. ఇన్‌ఛార్జ్ వీసీ, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ కోఆర్డినేటర్, రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్, పీజీ పరీక్షల కోఆర్డినేటర్, పరీక్షల సీటీఏ వంటి ఏడు కీలక పదవులు చంద్రబాబు సామాజిక వర్గానికి కట్టబెట్టారు. ఓట్లు, జనాభా పరంగా అతి తక్కువ ప్రాతినిధ్యం ఉన్న ఆ సామాజిక వర్గానికి పదిహేను పదవుల్లో ఏడు కీలక పదవులు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గత ఏడాదిన్నర కాలంగా తీవ్ర ఆరోపణలు వస్తున్నా తాజాగా ఖాళీ అయిన రెక్టార్ పోస్టులోనూ అదే సామాజిక వర్గానికి చెందిన ఓ అధ్యాపకుడిని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో అందరూ విస్తుపోయారు. వర్సిటీ ఏర్పాటైనప్పటి నుంచి ఇలా కీలకమైన రెండు పదవులూ ఒకే సామాజిక వర్గానికి కట్టబెట్టడం ఎప్పుడూ జరగలేదని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఇతరులకు దిక్కేలేదు...

కూటమిలో గెలుపులో తాము చాలా కీలకం అని చెప్పే కాపులు, ఎస్సీల్లోని ఓ వర్గం, గుంటూరు జిల్లా ఓట్ల పరంగా పెద్ద ప్రభావం చూపే బీసీల్లో ప్రాధాన్యత కలిగిన సామాజిక వర్గాలకు ఏఎన్‌యూ పదవుల్లో తీవ్ర అన్యాయం జరిగింది. చినబాబు నియోజకవర్గంలో ఉన్న వర్సిటీలో ఆయా వర్గాలపై చిన్నచూపు చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు చెందిన కాపు సామాజిక వర్గానికి ప్రాధాన్యత లేని పరీక్షల కోఆర్డినేటర్ పదవి ఒకటి ఇచ్చి పక్కన పెట్టారు. టీడీపీకి వెన్నుదున్నుగా నిలిచామని చెప్పుకుంటున్న ఎస్సీల్లోని ఒక సామాజిక వర్గానికి అస్సలు పదవే దక్కలేదు. టీడీపీకి మద్దతుగా నిలిచే యాదవ, గౌడ వంటి ప్రధాన బీసీ వర్గాలకు పూర్తిగా మొండిచేయి చూపారు. ఎస్టీలతో పాటు పలు ఇతర వర్గాలకు పదవుల ఊసేలేదు.

నాడు అందరికీ సమ ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర అణగారిన వర్గాలకు పెద్దపీట వేశారు. వీసీ, రెక్టార్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్, ఐఎస్‌సీ డైరెక్టర్‌తోపాటు పలు కీలక పదవులను ఈ వార్గల వారికి ఇచ్చారు. నేటి కూటమి ప్రభుత్వంలో దానికి భిన్నంగా వర్సిటీలో ఉన్న పదవుల్లో సగానికిపైగా, కార్యనిర్వాహణలో కీలక స్థానాలన్నింటిలో ఒక సామాజిక వర్గం వారికే కట్టబెట్టడం చంద్రబాబు ప్రభుత్వ అంతరంగాన్ని తెలియజేస్తోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

మొక్కుబడిగా ఇంటింటి సర్వే

- డయేరియా వ్యాప్తిని అరికట్టడంలో అధికారులు విఫలం
- ఇంకా మురుగునీటి కాలువల్లోనే తాగునీటి పైపులైన్లు
- డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేత
- ఆర్వో ప్లాంట్ల నీటిని అందిస్తున్నా సరిపోక స్థానికులకు కష్టాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గుంటూరు నగరంలో డయేరియా నియంత్రణకు నగరపాలక సంస్థ అధికారులు, జిల్లా యంత్రాంగం చేపడుతున్న కట్టడి చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. ప్రతి రోజు జీజీహెచ్‌కు, స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్లకు బాధితులు పదుల సంఖ్యలో వస్తూనే ఉన్నారు. సోమవారం డయేరియా లక్షణాలతో ఓ వృద్ధురాలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించిన విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచిన సంగతి తెలిసిందే. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వచ్చి సమీక్ష చేసి వెళ్లిన తర్వాత జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 30 మంది రోగులను ఆగమేఘాల మీద డిశ్చార్జ్ చేయడం విమర్శలకు దారితీసింది.

తూతూమంత్రంగా ఇంటింటి సర్వే

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పాతగుంటూరు ప్రాంతంలోని ప్రగతినగర్, సుద్దపల్లిడొంక, యాదవుల బజార్, బాలాజీనగర్, రామిరెడ్డినగర్, సీతానగర్, నెహ్రూనగర్, ఆర్టీసీ కాలనీల్లో డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పిన విషయం తెలిసిందే. సదరు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేపట్టేందుకు 50 బృందాలతో బృందాలను ఏర్పాటు చేశారు. అవి మొక్కుబడిగా సర్వే చేస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి లోపల నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అధికారులు తూతూమంత్రంగా 'మీ ఆరోగ్యం బాగుందా.. బాగోలేదా' అని అడిగేసి వెళ్లిపోతున్నారు. వార్డుల్లో డ్రైనేజీల్లో ఎక్కడైనా తాగునీటి పైపులైన్లు ఉంటే గుర్తించడం, అక్కడి నుంచి మార్చడానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటివి చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్లాంట్ల ద్వారా తాగునీటి సరఫరా

డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో నగరపాలక సంస్థ ద్వారా తాగునీటి సరఫరా నిలిపివేశారు. ఆయా ప్రాంతాల్లో సర్టిఫైడ్ మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించాలని అధికారులు ఆదేశించారు. అలాంటి ప్లాంట్లు తక్కువగా ఉండటంతో ఉన్న వాటి ద్వారానే ప్రజలకు సరఫరా చేసేందుకు అధికారులు అవస్థలు పడుతున్నారు. ఆ నీరు సరిపోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ పరిసరాల్లో వరద నీరు





గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండవీటి వాగుకు చేరిన వరద నీరు మండలంలోని నీరుకొండ గ్రామాన్ని చుట్టుముట్టింది. ఇక్కడి ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ పరిసరాల్లో భారీగా చేరింది. ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. మంగళగిరి నుంచి తాడికొండ వెళ్లే వాహనచోదకులతోపాటు నీరుకొండ, పెదపరిమి, తుళ్ళూరు పరిసర గ్రామాల వారు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొండవీటి వాగులో వరద నీటి ప్రవాహం మళ్లింపు కోసం ప్రత్యేకంగా సీఆర్‌డీఏ అధికారులు తవ్విన కాలువలు సైతం మునిగిపోవడం విశేషం.

– నీరుకొండ (మంగళగిరి)

కృష్ణానదికి వరద ఉద్ధృతి

- నదిలో క్రమక్రమంగా పెరుగుతున్న నీటి ప్రవాహం
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు
- లోతట్టు ప్రాంతాలలోకి భారీగా చేరిన వరద నీరు
- ముంపు ప్రాంత ప్రజల కోసం పునరావాస కేంద్రాలు సిద్ధం
- క్షేత్రస్థాయిలో పర్యటించిన బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్
- సహాయక చర్యలపై అధికారులు, సర్పంచ్‌లతో సమావేశం



కొల్లూరు సమీపంలో వరద నీటిలో మునిగిన ఇటుక బట్టీలు

కొల్లూరు/ భట్టిప్రోలు: కృష్ణానదిలో వరద ఉద్ధృతి పెరుగుతోంది. క్రమక్రమంగా నదిలో నీటి మట్టం ఎక్కువ అవుతోంది. మంగళవారం ప్రకాశం బ్యారేజ్ నుంచి 3,97,250 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసిన నేపథ్యంలో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజ్ ఎగువనున్న ప్రాజెక్టులతోపాటు తెలంగాణ ప్రాంతంలోని మున్నేరు, ఇతర వాగుల నుంచి వరద నీరు అధికంగా వస్తోంది. దీంతో అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నదిలో గణనీయంగా వరద నీరు పెరుగుతుండటంతో పెసర్లంక నక్కపాయ గండి, పోతార్లంక – గాజుల్లంక ప్రాంతాలలోని చిన్నరేవు, నది ఒడ్డుకు ఏర్పడిన కోతల ద్వారా వరద నీరు భారీగా లోతట్టు ప్రాంతాలలోకి ప్రవేశించి గ్రామాలను చుట్టుముట్టింది. వరద తీవ్రత అధికమవుతుండటంతో చింతర్లంక, పోతార్లంక, గాజుల్లంక, దోనేపూడి కరకట్ట దిగువున ఉన్న పంట పొలాలలో సాగులో ఉన్న అరటి, కంద, పసుపు, కూరగాయల పంటలు ముంపు బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. కొల్లూరు, గాజుల్లంక, పెసర్లంక ప్రాంతాలలోని పల్లపు భూములలోకి వరద నీరు చేరడంతో ఇటుక బట్టీలు ముంపునకు గురయ్యాయి. దోనేపూడి చినరేవు చప్టా పై నుంచి వరద నీటి ప్రవాహం అధికమవడంతో మండలంలోని 10 గ్రామాలకు చెందిన ప్రజలు గాజుల్లంక, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వరద తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో అధికారులు నది తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నదిలోకి పశువుల కాపరులు దిగరాదని, పిల్లలను నది వద్ద వెళ్లనీయకూడదని, ఈతకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణానది పరివాహక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. కొల్లూరు మండలంలోని వరద ప్రభావిత 21 గ్రామాలలో ఉన్న ప్రజల కోసం 13 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. కొల్లూరులో 8, అనంతవరం, చిలుమూరు, ఈపూరు, దోనేపూడి, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామాలలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో వీటిని సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

కలెక్టర్‌కూ తప్పని 'కరకట్ట' కష్టం

కరకట్ట ప్రయాణ కష్టాలు జిల్లా కలెక్టర్‌కు సైతం తప్పలేదు. కొల్లూరు వద్ద సుమారు రెండు కిలోమీటర్ల మేర కరకట్ట మార్గం పూర్తిగా దెబ్బతింది. నిరంతరం ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ కొల్లూరు కరకట్ట ప్రాంతానికి రావడంతో వాహనం ముందుకు సాగడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది.

వేదమాతా నమోనమః

గాయత్రీదేవిగా దుర్గమ్మ దర్శనం

- సర్వ దర్శనం క్యూలైన్లు కిటకిట
- రూ.100, రూ.300 లైన్లలో కనిపించని రద్దీ
- ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేదమాత గాయత్రీదేవిగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కొలువైన ఇంద్రకీలాద్రిపై దేవీశరన్నవ రాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన మంగళవారం దుర్గమ్మను శ్రీగాయత్రీదేవిగా అలంకరించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. వేకువజాము నుంచి ఉదయం ఆరు గంటల వరకు భక్తులతో అన్ని క్యూలైన్లు కిక్కిరిశాయి. అమ్మవారికి నిర్వహించే పలు ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు, ఉభయదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు కొండపైకి చేరుకోవడం ఇబ్బందికరంగా ఉందని పలువురు ఉభయదాతలు నేరుగా కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు చేశారు. ఉదయం ఆరు గంటల తర్వాత సర్వ దర్శనం క్యూలైన్లలో భక్తుల రద్దీ కొనసాగింది. అయితే రూ.100, రూ.300 టికెట్ల క్యూలైన్లు ఖాళీగానే దర్శనమిచ్చాయి. రద్దీని కట్టడి చేసేందుకు పోలీసు, రెవెన్యూ అధికారులు భక్తులను రూ.100 క్యూలోకి అనుమతించారు. ఇక అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక ఖడ్గమాలార్చన, శ్రీచక్రనవార్చన, చండీయాగం, కుంకుమార్చనలో ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక కుంకుమార్చనను మొదటి షిఫ్టునకే పరిమితం చేశారు.

వీఐపీ దర్శనాలకు బ్రేక్

తొలి రోజున ఆలయ ప్రాంగణంలో ఇష్టానుసారంగా వీఐపీల పేరిట జరిగిన దర్శనాలకు మంగళవారం బ్రేక్ పడింది. ప్రొటోకాల్ ఉన్న వారికి మాత్రమే సీఎం గేటు, వీఐపీల పేరుతో వచ్చే వారిని గాలిగోపురం వద్ద ఉన్న క్యూలైన్ ద్వారానే ఆలయంలో అనుమతించారు.

కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఉదయం లడ్డూ తయారీ పోటులను తనిఖీ చేశారు. ప్రసాదాల తయారీకి వినియోగిస్తున్న పిండి పదార్థాలు, పంచదార, నూనె, నెయ్యి, జీడిపప్పు నాణ్యతను పరిశీలించారు. రోజుకు ఎన్ని లడ్డూలు తయారు చేస్తున్నారు? మొదటి రోజు ఎన్ని విక్రయించారు? ఇంకా ఎన్ని నిల్వ ఉన్నాయన్న వివరాలను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నిత్యం 2.50 లక్షల లడ్డూలను తయారీ చేసేలా దేవస్థానం మూడు లడ్డూ పోటులను సిద్ధం చేసిందని, ఉత్సవాల్లో 36 లక్షల లడ్డూలు అవసరమయవుతాయని అంచనా వేశామని తెలిపారు.

రెండో రోజు ఆదాయం రూ.25.48లక్షలు

దసరా ఉత్సవాల్లో రెండో రోజున దేవస్థానానికి రూ.25.48 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. రూ.300 టికెట్ల విక్రయం ద్వారా రూ.8.99 లక్షలు, రూ.100 టికెట్ల ద్వారా రూ.3.16 లక్షలు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1.86 లక్షలు, ఆరు లడ్డూల ప్రత్యేక ప్యాక్‌ల ద్వారా రూ.9.66 లక్షలు, ప్రత్యేక కుంకుమార్చన టికెట్ల ద్వారా రూ.69 వేలు, ఇతర సేవా టికెట్ల విక్రయం ద్వారా ఈ ఆదాయం లభించిందని వివరించారు. రెండో రోజు సాయంత్రం ఐదు గంటలకు సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని, 19,629 మందికి అన్న ప్రసాదం అందజేశామని తెలిపారు.



అమ్మవారి దర్శనానికి క్యూలైనులో వేచి చూస్తున్న భక్తులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,400 గరిష్టం : రూ. 3,100

మోడల్ ధర రూ. 2,700

పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 00

కొమ్ములు : 957 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
00	00	00

కాయలు : 216 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,500	10,500	10,500

మొత్తం అమ్మకాలు : 22.50 క్వింటాళ్లు

క్లుప్తంగా

నేడు డీఎస్సీ సెలెక్టడ్ అభ్యర్థులకు ఐడీ కార్డులు జారీ

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ-2025 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు ఈనెల 25న అమరావతిలో సీఎం చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోనున్న దృష్ట్యా సంబంధిత కార్యక్రమంలో పాల్గొనేందుకు వీలుగా ఈనెల 24న ఐడీ కార్డులు జారీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 11 గంటలకు గుంటూరు పొన్నూరురోడ్డులో ఉన్న ఆంధ్ర ముస్లిం కళాశాలలో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. సీఎం కార్యక్రమంలో పాల్గొనేందుకు వీలుగా ఎంపికైన అభ్యర్థితో పాటు తోడుగా వచ్చే కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఐడీ కార్డు అందజేస్తారని, అభ్యర్థులు తమ ఫొటో తో పాటు వెంట వచ్చేవారికి సంబంధించిన పాస్‌పోర్ట్ ఫొటో, ఐడీ కార్డును వెంట తెచ్చుకోవాలని తెలిపారు. సంబంధిత అభ్యర్థులను 25వ తేదీ ఉదయం 7 గంటలకు ఆంధ్ర ముస్లిం కళాశాల నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో అమరావతిలో జరిగే కార్యక్రమానికి తీసుకుని వెళతామని తెలిపారు.

ఏఎన్‌యూ లా బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా 'నర్రా'



నాదెండ్ల: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లాబోర్డు ఆఫ్ స్టడీస్ (అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్) సభ్యుడిగా సాతులూరు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఎన్‌యూ డిప్యూటీ రిజిస్ట్రార్ కె రంగారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన న్యాయశాస్త్రంలో డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ విభాగంలో సిలబస్, ఇతర అంశాల నిర్ణయాలకుగాను తొమ్మిది మంది సభ్యులతో వైస్ ఛాన్సలర్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఏర్పాటు చేశారు. ఈయన ఏఎన్‌యూ పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా, హైకోర్టు న్యాయవాదిగా, అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ప్రస్తుతం సేవలందిస్తున్నారు. న్యాయ విద్యార్థు లు, న్యాయవాదులకు తరచూ అనేక అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈయన వద్ద శిక్షణ పొందిన అనేక మంది న్యాయమూర్తులుగా, పీపీలుగా, ప్రభుత్వ విభాగాల్లో న్యాయసలహాదారులుగా సేవలందిస్తున్నారు. ఇప్పటికే ఏఎన్‌యూ న్యాయసలహాదారుగా వ్యవహరిస్తున్నారు.

అమెరికా వైద్యులు గుంటూరులో సేవలు

- క్యాన్సర్ నిర్ధారణతో పాటుగా చికిత్స సైతం ..
- అత్యాధునిక వైద్య పరికరాలతో క్యాన్సర్ నిర్ధారణ
- గురువారం వరకు కొనసాగనున్న స్క్రీనింగ్ క్యాంపు
- 21 నుంచి 60 ఏళ్లలోపు మహిళలు పరీక్షలు చేయించుకోవాలని సూచన

జీజీహెచ్‌లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న విదేశీ వైద్యులు

ఆ మహిళలు అమెరికాలో ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్న వైద్యులు. రెండు చేతులా సంపాదన ఉన్నా మనసులో ఏదో తెలియని అసంతృప్తి. ఎంతో మంది క్యాన్సర్ బారిన పడి చికిత్స కోసం రావటం వారి మనసును కలిచి వేసింది. ముఖ్యంగా మహిళలు చిన్న వయస్సులోనే క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోవటం చూసి చలించిపోయారు. తమ వంతుగా క్యాన్సర్ నివారణకు ఏమైనా చేయాలని కంకణం కట్టుకున్నారు. వీరికి ఒక ఎన్‌జీఓ సహకారం అందించింది. దీంతో క్యాన్సర్‌పై సమరం చేసేందుకు సిద్ధమయ్యారు. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల కంటే భారత దేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎక్కువ మంది పేదలు ఉంటారని, చికిత్సలు చేయించుకోకుండా, కనీసం వ్యాధి నిర్ధారణ కూడా చేయించుకోక ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు తెలుసుకుని ఇండియాలో క్యాన్సర్ చికిత్సలు ఉచితంగా చేసేందుకు కదలి వచ్చారు. – గుంటూరు మెడికల్



ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ యశస్వి రమణ, పక్కన అమెరికా నుంచి వచ్చిన డాక్టర్ సమత కడియాల, డాక్టర్ జీస్ టాల్బర్ట్, డాక్టర్ కారోల్ హాబాక్

కృష్ణా జిల్లాకు చెందిన డాక్టర్ కడియాల సమత విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివి నేడు అమెరికాలో వైద్యురాలిగా స్థిరపడ్డారు. ఆమె వద్దకు చికిత్స కోసం వచ్చే వారిలో ఎక్కువ మంది గర్భాశయ క్యాన్సర్ బాధితులు ఉండటం గమనించారు. అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశంలో పరిస్థితి చూసి ఆశ్చర్యపోయి ఇక భారతదేశంలో ఎంతో మంది అమాయక మహిళలు క్యాన్సర్‌కు బలవుతుంటారని ఆలోచించారు. ఇండియాలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసి క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించి ప్రాణాలు పోకుండా కాపాడాలని నిర్ణయించుకున్నారు. ఆమె మహా సంకల్పానికి పింక్ అనే ఎన్‌జీఓ సంస్థ సహకారం అందించింది. అమెరికాలో తనతోపాటుగా పనిచేస్తున్న డాక్టర్ జీస్‌టాల్బర్ట్, డాక్టర్ కారోల్ హాబాక్‌లు ఇండియాకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. తాను ఎంబీబీఎస్ చదివే రోజుల్లో స్నేహితుడు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ సూచనలతో డాక్టర్ సుమత కడియాల సోమవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం వరకు ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం జరగనుంది.

ముందస్తుగా నమోదు చేయించుకోవాలి...

ఈనెల 25 వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహిళలకు ఉచితంగా గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ వైద్య నిపుణులు ఉచితంగా గుంటూరు వచ్చి పరీక్షలు చేస్తున్న దృష్ట్యా 21 నుంచి 60 ఏళ్ల మహిళలు ప్రతి ఒక్కరు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందస్తుగా పేర్లు నమోదు చేయించుకోవాలని పేర్లు నమోదు కోసం స్టాఫ్ నర్సు అంజమ్మను 9640102066 నెంబరులో సంప్రదించాలన్నారు.

ప్రత్యేక వైద్య పరికరాలు సైతం అక్కడినుంచే..


యువ వైద్యులకు శిక్షణ ఇస్తున్న అమెరికా వైద్యులు

గర్భాశయ క్యాన్సర్‌ను చాలా త్వరగా గుర్తించి(ప్రాథమిక దశలో) చికిత్స కూడా వెంటనే అందించే అత్యాధునిక వైద్య పరికరాలను సైతం డాక్టర్ కడియాల సమత గుంటూరు జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఒక పక్క పేద రోగులకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య పరీక్షలు చేస్తూనే మరో పక్క యువ వైద్యులకు సైతం అత్యాధునిక క్యాన్సర్ వైద్య పరికరాలు ఏ విధంగా ఉపయోగించాలనే విషయాలపై సైతం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఏపీలో ఎక్కడా లేని విధంగా అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్య పరికరాలు, వైద్య సౌకర్యాలు నాట్కో ట్రస్ట్ గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసింది. దీంతో క్యాన్సర్ చికిత్సలు కూడా తక్షణమే చేసేలా అమెరికా నుంచి వచ్చిన వైద్యులకు వెసులుబాటు కలిగింది.

మిత్రుడిని హతమార్చిన నిందితుల అరెస్ట్

చిలకలూరిపేట: స్నేహితుడిని తలపై రాడ్‌తో కొట్టి, గొంతును తాడుతో బిగించి క్రూరంగా హత్య చేసిన ముగ్గురు నిందితులను చిలకలూరిపేట రూరల్ సర్కిల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన తాడిబోయిన గోపి(32) గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసేవాడు. అతను దక్షిణామూర్తి సెలిస్టియాన్ క్రియేషన్స్ బ్యానర్‌పై షార్ట్‌ఫిలింలు, మిషన్ మంగళాద్రి పేరు మీద వెబ్‌సిరీస్‌లు తీయడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూన్ 25వ తేదీన గుర్తుతెలియని మృతదేహం యడ్లపాడు సర్వీస్ రోడ్డు కాల్వలో కాలిపోతున్న స్థితిలో కనిపించింది. పోలీసుల విచారణలో అది తాడిబోయిన గోపిదిగా గుర్తించారు. చనిపోయిన గోపికి గుంటూరుకు చెందిన ఆఫ్రిన్ అనే ఆమె ద్వారా వాళ్ల తమ్ముడు, గుంటూరులోని సుద్దపల్లిడొంకలో నివాసం ఉండే షేక్ ఇమ్రాన్ పరిచయమయ్యారు. కొంతకాలానికి గోపి, ఇమ్రాన్‌ల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో గోపిని హత్యచేయాలని నిర్ణయించుకున్నాడు. ఇమ్రాన్‌కు స్నేహితులైన గుంటూరు రామిరెడ్డిపేటకు చెందిన షేక్ రియాజ్, నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ ఖాజామొహిద్దీన్‌లను కలుపుకొని పథకం ప్రకారం గుంటూరులోని ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న ఇమ్రాన్ అద్దె గదికి గోపిని జూన్ 24న ఫోన్ చేసి రప్పించారు. ముగ్గురు కలసి ఇనుపరాడ్డుతో గోపి తలపై కొట్టి ఆపై తాడుతో మెడకు ఉరివేసి హత్యచేశారు. మృతుడు గోపికి చెందిన కారు డిక్కీలో శవాన్ని చిలకలూరిపేటకు తీసుకువచ్చి ఇక్కడ పెట్రోల్ బంకులో రెండు లీటర్ల పెట్రోల్ కొనుగోలు చేసి గుంటూరు రోడ్డులో తిమ్మాపురం దాటిన తర్వాత యడ్లపాడు సమీపంలో సర్వీస్ రోడ్డు పక్కన సిమెంట్ కాల్వలో గోపీ మృతదేహాన్ని వేసి పెట్రోలు పోసి తగలబెట్టి పరారయ్యారు. యడ్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గోపికి చెందిన కారు, కీ ప్యాడ్ ఫోన్, సెల్‌ఫోన్, ఏటీఎం కార్డులు, రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రసవత్తరంగా విజ్ఞాన్ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్


పోటీలలో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు

చేబ్రోలు: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మంగళవారం రెండో రౌండ్ ముగిసేసరికి 68 మంది క్రీడాకారులు తలో రెండు పాయింట్లతో అగ్రస్థానాన్ని పంచుకున్నారు. ఎక్కువమంది అగ్ర క్రీడాకారులు మూడో రౌండ్‌కి సులభంగా అడుగుపెట్టారు. మాజీ జాతీయ చాంపియన్ గ్రాండ్ మాస్టర్ సూర్యశేఖర్ గంగూలీ (పీఎస్‌పీబీ) టాప్ బోర్డులపై తొలి విజయాన్ని నమోదు చేశారు. గియూకో పియానో ఆరంభంలో, 19వ మూవ్‌లో యషద్ బంబేశ్వర్ (ఛత్తీస్‌గఢ్) చేసిన తప్పిదాన్ని గంగూలీ సద్వినియోగం చేసుకున్నారు. వరుసగా బిషప్, నైట్ త్యాగాలు చేసి పూర్తిగా ఆధిపత్యం సాధించిన గంగూలీ, 30వ మూవ్‌లో ప్రత్యర్థిని రాజీనామా చేయించారు.

- టాప్ సీడ్ జీఎం ఇనియన్.పి (తమిళనాడు), అధిరాజ్ మిత్రా(ఝార్ఖండ్)పై గెలుపొందాడు. వెటరన్ జీఎం కృష్ణన్ శశికిరణ్, హృషికేశ్ బానిక్ (పశ్చిమ బెంగాల్)పై గెలుపొందాడు. కొత్తగా గ్రాండ్ మాస్టర్ బిరుదు పొందిన ఎస్.రోహిత్ కృష్ణ (తమిళనాడు), దేవర్ష భోర్కటేరియా (గుజరాత్)పై గెలుపొందాడు. జీఎం.ఎం.ఆర్.లలిత్ బాబు (ఆంధ్రప్రదేశ్), అయుష్ రవికుమార్ (తమిళనాడు)పై ఆసక్తికర పోరులో గెలిచారు. కర్ణాటక ఐఎం వియాని ఆంటోనియో డి కున్హాను ఆంధ్ర యువకుడు అందమాల హేమల్ వర్షన్ డ్రాలో కట్టేశారు. మూడో రౌండ్‌లో టాప్ బోర్డులపై మరింత రసవత్తర పోటీలు జరగనున్నాయి.

హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

మంగళగిరి: ఆరు సంవత్సరాల క్రితం నగర పరిధిలోని కొత్తపేటలో జరిగిన హత్య కేసు ఘటనలో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ 5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... 2019, ఆగస్టు 2న మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం గ్రామానికి చెందిన బొద్దులూరి వెంకటరమణ(43) కొత్తపేటకు చెందిన మోటుకూరి భాస్కరరావు మద్యం మత్తులో ఘర్షణకు పాల్పడ్డారు. అనంతరం చుట్టూ వున్నవారు వారించడంతో ఎవరి ఇళ్లకు వారు వెళ్లారు. అయితే వెంకటరమణ కొత్తపేటలోని భాస్కరరావు నివాసానికి వెళ్లి తనపై ఎందుకు ఘర్షణకు దిగావని వాగ్వివాదానికి దిగాడు. దీంతో ఆగ్రహం చెందిన భాస్కరరావు తన ఇంటిలోని కుట్టుమిషన్‌పై వున్న కత్తెరతో వెంకట రమణను పొట్టలో పొడవగా గాయాలపాలైన వెంకట రమణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై అప్పటి ఎస్ఐ సీహెచ్ రవిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడు భాస్కరరావును కోర్టులో హాజరుపరచి చార్జిషీటు దాఖలు చేశారు. గుంటూరు జిల్లా మూడో ఏడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముబీన బేగం వాదనలు వినిపించగా సదరు కేసును విచారణ జరిపిన జిల్లా మూడవ ఏడీజే కోర్టు జడ్జి సి.వెంకట నాగ శ్రీనివాసరావు ముద్దాయి భాస్కరరావుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు.

అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చించాలి

కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్ నాయకుల నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యలపై చర్చించాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అదేవిధంగా జాబ్ క్యాలెండర్ విడదల చేయాలని, నిరుద్యోగ భృతి మంజూరు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా షేక్ వలి మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా ఏటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి విడుదల చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. అదేవిధంగా అధికారం వచ్చిన 100 రోజుల్లో 107-108 జీఓలు రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు, పైగా మెడికల్ కాలేజీ లను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణకు ఇవ్వడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని శాఖల్లో పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేసి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇవ్వాలని తీర్మానం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, నగర అధ్యక్ష కార్యదర్శులు శ్రీను, మరియదాసు గుంటూరు జిల్లా కార్యదర్శి యస్వంత్ నగర కార్యదర్శి బన్నీ సాయి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గోపి, నవీన్, రెహ్మాన్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

14 మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 14 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడింది. అత్యధికంగా తుళ్ళూరు మండలంలో 36.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో మి.మీ. కురిసింది. సగటు 10.1 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలంలో 35.4 మి.మీ., తాడేపల్లి 25.8, దుగ్గిరాల 18.6, కొల్లిపర 15.4, పెదకాకాని 11.2, కాకుమాను 9, గుంటూరు పశ్చిమ 7.6, గుంటూరు తూర్పు 6.4, మంగళగిరి 6, తాడికొండ 5.2, పొన్నూరు 2.2, మేడికొండూరు మండలంలో 1.2 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది. సెప్టెంబర్ మాసం 23వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 122.2 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 245 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగిపై కేసు నమోదు

చిలకలూరిపేటటౌన్: ఫోన్‌లో మెసేజ్‌లు పెడుతూ వివాహితను వేధింపులకు గురిచేస్తున్న పురపాలక సంఘం కాంట్రాక్ట్ ఉద్యోగిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరా లప్రకారం...పట్టణంలోని భావనరుషినగర్‌లో నివాసం ఉంటున్న అవ్వారు రమేష్ తన ఇంటి పక్కనే ఉంటున్న వివాహితకు కొంతకాలంగా ఇబ్బందికరమైన మెసేజ్‌లను పెడుతున్నాడు. ఆమె పోలీసులకు ఫిర్యా దు చేసింది. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇద్దరి నివాసాలు పక్కపక్కనే ఉండటం వల్ల పరిచయం ఏర్పడిందని, దానిని అడ్డుపెట్టుకొని రమేష్ ఈ వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు వెల్లడించింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడలతోనూ ఉత్తమ భవిష్యత్తు

- ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు
- వర్సిటీలో అంతర కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలు ప్రారంభం

పెదకాకాని(ఏఎన్‌యు): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం అంతర కళాశాలల పురుషుల కబడ్డీ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవంలో వీసీ ఆచార్య కె.గంగాధరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనిషికి చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా మనిషి ఎదుగుదల, వికాసం, శరీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు క్రీడలను అశ్రద్ధ చేయడం వలన పిల్లలు క్రీడలకు దూరం అవుతున్నారన్నారు. క్రీడా నైపుణ్యాలు, క్రీడాకారులు సామర్థ్యం, క్రీడల విశిష్టతను కొనియాడారు. వర్సిటీ ఆర్ట్స్, లా ప్రిన్సిపాల్, టోర్నమెంట్ ప్రెసిడెంట్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, రెక్టార్ ఆచార్య ఆర్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ జి.సింహాచలం, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ పాల్గొన్నారు. కమిటీ మెంబర్లుగా డాక్టర్ పి.శ్రీనివాసరావు, పి.గణేష్, కె.ప్రసన్నకుమార్‌లు వ్యవహరించారు. ఏఎన్‌యూ పరిధిలోని 21 కళాశాలల జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి.

క్రీడలకు సాంకేతికత జోడింపుతో ఉత్తమ ఫలితాలు

పెదకాకాని(ఏఎన్‌యు): రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో 36వ దక్షిణ మండల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల విధానంలో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. ఆధునిక సాంకేతికతను క్రీడల రంగానికి జోడించడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా పలు అథ్లెటిక్ అసోసియేషన్లు, మల్టీ నేషనల్ కంపెనీలు క్రీడలను ప్రోత్సహించడం సంతోషకరమన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి

తొలుత అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పతాకాన్ని మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ పతాకాన్ని శాప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, లక్షద్వీప్, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.